కొడుకు

ఈ మూడు సంవత్సరాల్లోనూ సుబ్బారావు పూర్తిగా మారిపోయ్యాడు. ఆ బిళ్ళగోచీ పంచకట్టుకు బదులు గూడ కట్టూ, జాకెట్ లాటి బనీనుకుబదులు టెన్నిస్ కాలర్ షర్టూ, ముక్కానీ టెంకాయిలాగ పిలకకుబదులు సమ్మర్ క్రాపూ— మొత్తానికి అటు అరవకూ ఇటు ఆంధ్రుడికీ మధ్య సంధికూర్చేందుకన్లే ప్రదర్శించిన అవతారం గోపాలానికి ఆశ్చర్యమే కలిగించింది.

"ఓహో అన్నగారూ! బహుకాలదర్శనం" అంటూ గోపాలం కూర్చున్న కుర్చీపక్కన నిలబడ్డాడు సగానికి ఎగ కట్టిన గూడకట్టుతో.

"ఏరా! ఈ ఉద్యోగం ఎప్పటినుంచీ?"

ఈ మాటకు చిన్నబోకుండానే సుబ్బారావు సమాధానం చెప్పాడు: "ఏదోమరి.... బతుకుతెరువు చూసుకోవద్దూ? మీరందరూ గొప్ప చదువులు చదివి ఉద్యోగాలు చేస్తున్నారాయె; నాబోటీ నిశానీదొరలకు యీ కాఫీహోటల్ సర్వింగ్ కన్న ఇంకేమంత పెద్ద ఉద్యోగాలు దొరుకుతయ్?"

"బ్రాహ్మడివై పుట్టినందుకు ఇదే సులభసాధ్యమంటావ్?"

దీనికి సమాధానం చెప్పకుండానే సుబ్బారావు, "ఏదో పనిమీద వచ్చినట్టున్నావ్—ఎప్పుడొచ్చావ్?" అన్నాడు.

"మొన్ననే.... ఇది పొగాకుసీజన్ కాదట్రా?" మిగతా వాక్యాన్ని సుబ్బారావు ఊహించుకోగలిగాడు.

"ఒక డ్రింక్ తెచ్చిపెట్టు—"

సుబ్బారావు తెచ్చిన డ్రింకు తాగి, గోపాలం ఒక్కసారి ఆవలించాడు; మిట్టమధ్యాహ్నం కాఫీహోటల్లో ఇంకెవ్వరూ లేరు.

"వదినావాళ్ళూ ఎక్కడున్నారు?"

ఈ ప్రశ్నకు గోపాలం నవ్వాడు, కాని ఆనవ్వులోని అర్థం సుబ్బారావుకు స్ఫురించలేదు. "ప్రస్తుతం ఏవదినా లేదు—"

"అదేమిటన్నయ్యా—ఇంకా పెళ్ళి చేసుకోనేలేదా?"

'లేదు' అన్నట్టు తలతిప్పి— "పోనీ నీకు పెళ్ళయిందా?" అన్నాడు

"నాకెవరు పిల్లనిస్తారు?" సుబ్బారావు తనకు వివాహం మీాది కౌతుహాలాన్ని ఒకవిధంగా విప్పిచెప్పాడు.

గోపాలానికీ సుబ్బారావుకూ చాలదూరపు బీరకాయపీచు బంధుత్వం. చిన్నప్పుడు సరిగ్గా చదువుకోక సుబ్బారావు ఒక శుంఠకింద తయారయ్యాడు. అవసరాన్నిపట్టి అప్పుడప్పుడు 'జేబుదొంగ'గా కూడా తరిఫీదవటంవల్ల బంధువర్గాల్లో ఎవ్వరూ వీణ్ని దగ్గరకు జేరనిచ్చేవారుకాదు. అల్లాంటి యంబ్రహ్మకు ఎవ్వరూ పిల్లనివ్వరని గోపాలానికీ తెలుసు.

"సరే వస్తారా—తొందరగా పోస్టాఫీసుకు వెళ్ళాలి"

"కన్పిస్తూవుండు—" గోపాలం తలవూపి బిల్లిచ్చి బయిట పడ్డాడు.

2

చిటపటమని చినుకులు ప్రారంభమయ్యేప్పటికి నడిబజారులో నిలబడ్డ గోపాలానికి ఎటుపొయ్యేందుకూ పాలుపోలా. ఇటూఅటూ కాపరాలుచేసే ఇళ్ళవటంలో అతని కాలు వెనకా ముందాడుతోంది.

"అన్నయ్యా!" కేకవిని వెనక్కు తిరిగి చూశాడు. సుబ్బారావ్! వాడు అద్దెకుంటూన్న ఇల్లుకాబోలు !

సుబ్బారావుతో ఇంట్లో ప్రవేశించి, సుబ్బారావు చూపిన మంచంమీద కూలబడ్డాడు.

"మంచినీళ్ళు కావాలా?" గోపాలం తలతిప్పాడు.

"సుందూ! కాసిని మంచినీళ్లు తీసుకురా—"

ఒక నిమిషం గడిచాక పద్ధెనిమిదేళ్ళ సుందరి ఒకతె మంచినీళ్ళ గ్లాసుతో ప్రత్యక్షమైంది. అవయవ సౌష్ఠవంతో కూడిన ఆమె యవ్వనం గోపాలాన్ని బాగా ఆకర్షించింది. అమాయకంగా చూసే ఆమె చూపులు గోపాలాన్ని చకితుణ్ని చేసినయ్.

"మా అన్నయ్య!" అమాయకంగా గోపాలాన్ని చూస్తూన్న ఆమెతో సుబ్బారావు అన్నాడు.

ఆమె మాట్లాడకుండా ఇంకా గోపాలాన్నే చూస్తూ నిలబడ్డది. మంచినీళ్లు తాగుతున్న గోపాలానికి ఆమె పర పురుషుణ్ని ఇంత విమర్శనా పూర్వకంగా చూస్తుందేమా అనిపించింది. ఆమె చూపుల్లోని అమాయకత్వంలో ఒక

విధమైన అయోమయంకూడా అతనికి స్ఫురించింది. ఈమె ఎవరో తెలుసుకుందామనే కుతూహలమున్నా ఆమె సమక్షంలో సుబ్బారావును అడుగుతే బాగుండదని ఊరు కున్నాడు. తనకింకా వివాహం కాలేదని సుబ్బారావే తనతో ఆ కిందటిరోజునే చెప్పాడు!

ఆ అకాలవర్షం ఐదు నిమిషాల్లోనే ఆగిపోయింది. గోపాలానికి ఇంకా కాసేపువర్షం కురిస్తే ఆమెను చూస్తూ కూర్చోవచ్చనిపించింది; కాని ఇంత అసందర్భంగా, నిష్కా రణంగా ఆమె తననుఇంతగాఢంగా ఎందుకు ఆకర్షించిందో గోపాలానికే తెలియలేదు!

సుబ్బారావు గోపాలాన్ని రోడ్డుమీదికి సాగనంపి, అన్నాడు: "అన్నయ్యా! నీతో ఒక సంగతి మాట్లాడాలి, రాత్రి గదికి రమ్మంటావా?"

"ఏమన్నా రహస్యమా?" సుబ్బారావుతల వూపాడు.

"సరే రా....ఐదో క్రాసురోడ్డులో ప్లీడరు రాంమూర్తి మేడ మీద"

"ఉంటావుగా?"

"ఉండక?" గోపాలం నవ్వుతూ నడక సాగించాడు. వీడు తనతో మాట్లాడే పరమరహస్యం యేమిటా అని ఆలోచించి బహుశా ఏదైనాసహాయాన్ని అర్థిస్తాడేమోనని గోపాలం ఊహించుకున్నాడు.

3

చల్లగాలి పీలుస్తూ కళ్ళు మూసుకు పడుకున్న గోపాలం–అడుగుల చప్పుడు విని ఉలిక్కిపడ్డాడు. సుబ్బారావును గదికి పిమ్మన్న సంగతే అతను మరిచిపోయ్యాడు !

గది అంతా పరికించి చూసి పక్కనేవున్న క్యాంపు కాటు మీద కూలబడుతూ, "అద్దెంతా?" అని అడిగాడు, సుబ్బారావు.

"ఐదు—" ఐదు నిమిషాలు నిశ్శబ్దంతో గడిచాయి. సుబ్బారావు మాత్రం.... పద్యం సగంలో ముందుపాదం రాక రంగస్థలం మీద అవస్థపడే నటుడిలాగ, ఏదో చెప్పబోయి ఆగుతూన్నట్టున్నాడు.

"ఏమిట్రా ఆ రహస్యం?" సుబ్బారావు అవస్థచూసి గోపాలమే కదిపాడు. సుబ్బారావు రెండు గుటకలు మింగి మంచాన్ని గోపాలం దగ్గరకు లాక్కొని, "ఒక్క సహాయం చెయ్యాలన్నయ్యా!" అన్నాడు.

ఏదో డబ్బుకు పేచీ పారేస్తున్నాడని గోపాలం అనుకొని, "ఏమిటది?" అన్నాడు.

"మనం ఒకర్నొకరం చూసుకొని మూడేళ్ళయింది. నా జీవితంలో జరిగిన మార్పులు నీకు తెలియవనుకొంటాను."

నిజానికి వీడి జీవితచరిత్ర ఎవరిక్కావాలి ?

'తెలియదు' అన్నట్టు గోపాలం తలతిప్పాడు.

సుబ్బారావు తడపడుతున్న మాటల్తో, "నాకు పెళ్ళి కాకపోయినా...." అని కొంచెం ఆగి సిగ్గు పడుతూ "ఒక అమ్మాయిని తీసుకొచ్చాను—" అన్నాడు. గోపాలం నవ్వి 'తరువాత చెప్పు' అన్నట్టు చూశాడు.

"మధ్యాహ్నం నువ్వు చూశావే— ఆ పిల్లే!" గోపాలాన్ని పీక్కు తింటూన్న అనుమానం కాస్తా తీరింది. ఆమె వీడి పెళ్ళాం కాదన్న విషయం దృఢపడ్డది.

దాన్ని తీసుకొచ్చి ఆర్నెల్లవుతుంది. అంతకు పూర్వం కాలాన్ని ఎల్లా గడిపినా—ఆమె నా చేతుల్లో పడ్డప్పటినుంచీ యీ కాఫీహోటల్ ఉద్యోగం నాకు తప్పని సరయింది. ఇప్పుడు నాకొక సంబంధంకూడా దృఢపడ్డది. పెళ్ళిచేసుకొని దూరాన వుందామనిపిస్తోంది. ఇప్పుడు దాన్ని విడిచేయ్యాలనుకుంటున్నా....అసలు అది నాబోటివాళ్ళ చేతుల్లో పడాల్సింది కాదన్నయ్యా! ఈ సంగతి దాంతో చెప్తే ఏడుస్తోంది; ఇప్పుడు నాగతేమంటుంది. దానికి ఏదైనా మార్గంచూపి నేను మాఊరు వెళ్ళి పోవాలనుకుంటున్నా...."

సుబ్బారావు ఉపన్యాస ధోరణి గోపాలానికి అర్థమవక పోలేదు. వాడు తన మనస్సును విప్పి చెప్పేందుకు జంకుతున్నాడు. ఇదా వీడి కుంభకోణరహస్యం? వీడి శాల్థంలాగుంది! చిన్నతనంలో వాడికి తనదగ్గరుండే ఛనువు వల్లనే ఇంతవరకూ చెప్పగలిగాడు.

కాని గోపాలం మళ్ళీ ఆలోచించాడు. తను లోకం దృష్టిలో ముదురు బ్రహ్మచారయినా, స్త్రీస్పర్శ లేనివాడు మాత్రం కాదు. విశేషించి ఆమె తనను ఆకర్షించింది. గోపాలానికి ఆమెపైన కవులు వర్ణించే 'ప్రేమ' లేదుకాని, వాంఛమాత్రం వుంది. మనస్సును జయించలేని సామాన్య మానవుడు తను కోరిందీ, వెదకి వేసారేదీ కాళ్ళదగ్గరకువచ్చి నప్పుడు కాలతన్నుకోలేడు. ఐనా గోపాలం గంభీరంగా "ఆమె దీనికి ఒప్పుకుందా?" అని అడిగాడు.

బితుకుబితుకుమంటూన్న సుబ్బారావు గుండెకు కొంత ధైర్యం చిక్కింది. అన్నాడు: "ఈసమయంలో ఒప్పు కోక ఏం చేస్తుంది? ఎల్లాగైనా ఆమెను వొదిలించుకుపోతే- తరువాత ఆమె జీవితం ఎల్లా మారినా మనబాధ్యత తీరు తుందిగా!" ఆగి 'ఏమంటావ్?' అన్నట్టు చూశాడు.

సుబ్బారావులాంటి అధములు అమాయక స్త్రీల జీవి తాల్ని పాడుచెయ్యగలగటం లోకానికిది మొదటిసారిమాత్రం కాదు. కాని జీవితమధ్యంలో దిగనాడటంకన్నా - వర పురుషుణ్ణన్నా వెదికి జీవితాన్ని నిలబెట్టటానికి ప్రయత్నించ టానికి మాత్రం గోపాలం దృష్టిలో సుబ్బారావే ప్రథముడు.

సమాధానం రాకపోవటంచూసి సుబ్బారావు తగ్గు స్థాయిలో అడిగాడు : "ఏం అన్నయ్యా?"

'ఎబ్బె—నేను అటువంటివాణ్ణి కాదు. త్వరగా ఇక్క ణ్ణుంచి తొలగిపో తక్షణం' అనేందుకు గోపాలం కోర్కె అడ్డగి స్తోంది. త్వరగా లొంగిపొయ్యేందుకు అతని ఆత్మాభిమానం

అష్టపడుతోంది. ఏమైనా కోర్కె జయించగలిగి, గోపాలం చేత తలవూగించింది.

"రాత్రికి వెళ్దాం–" లేని అలుసునుతీసుకొని మాట్లా డటంలో సుబ్బారావుకు మించిన చెయ్యిలేదు. గోపాలానికి తెలిసినప్పటినుంచీ సుబ్బారావు తత్వమే అది.

"ఊఁ" అన్నాడు వినపడి వినపడకుండా. సుబ్బా రావు మాట్లాడకుండా మేడమెట్లుదిగి వెళ్ళిపొయ్యాడు.

తనకోర్కె ఇంత సులభంగా తీరేసమయం వుంటుం దని తను అనుకోలేదు. ఈ నూతన వాతావరణం తనను ఎల్లా ఆవరించి అధీనం చేసుకోగలిగిందోనని గోపాలం ఆలోచించసాగాడు.

4

"సిగ్గు పడుతున్నావా?" ఆమె 'లేదు' అన్నట్టు తలతిప్పింది.

"కొంచెం మంచినీళ్ళిస్తావా?"

ఆమె ఇచ్చిన గ్లాసులోని మంచినీళ్ళను సగంతాగి, గ్లాసు కిందపెట్టాడు; మిగతా నీళ్ళను ఆమె తాగింది.

ఆమె తను అనుకున్నంత అమాయకురాలు కాదనీ, కొద్ది రసికురాలేననీ గోపాలం గ్రహించాడు. అసలు రసి కత్వం లేకపోతేనే యీ సుబ్బారావుతో లేచి వచ్చిందా అని అతని అనుమానం.

ఆకులూ వక్కలూ వున్న పింగాణీప్లేటును పట్టుకొని ఆమె గోపాలానికి ఎదురుగా నిలబడ్డది.

"వేసుకోమంటావా?" అన్నాడు గోపాలం.

"ఊఁ"

ఆమె సున్నం రాసిఇచ్చే ఆకుల్ని నములుతూ గోపాలం అడిగాడు: "నీ పేరేమిటో చెప్పావ్ కాదు—"

"మీకు తెలియనట్టు—"

"మరిచి పొయ్యాను"

"ఇంతమరుపైతే పొగాకువ్యాపారం ఎట్లాచేస్తున్నారో?" గోపాలం తనలో తను నవ్వుకున్నాడు.

"చెప్తే నోటిముత్యాలేమైనా రాలిపోతయ్యా ?"

"చెప్పటానికేం ? మళ్ళీ రేపటికే మరిచిపోతారు"

"ఈసారి మరిచిపోనుగా—"

"మరిచిపోతే ?"

"కాగితంమీద రాసుకుంటా"

"సుందరి" అని ఆమె ప్లేటును అవతలవుంచి, ఒక తెల్లకాగితం ముక్కను అందించింది.

"ఇదెందుకూ ?"

"పేరు రాసుకుంటానన్నారు కదూ?"

గోపాలం నవ్వుకొని 'సుందరి' అని కాగితంమీద రాసి జేబులో పెట్టుకొని ఆమెవైపు చూశాడు; ఆమెకూడా నవ్వుతోంది తనుచేసిన కొంటెపనికి !

అందాల్ని చిందుతూన్న చందమామ మధురతర మందహాసంతో పరుగులెత్తుతూ కిటికీలోంచి తొంగి చూసి, ప్రసరింపజేసే వెన్నెల ఆ తెల్లని పక్కలో ఐక్యమాతోంది. పదకొండుగంటల బండి వెళ్తూవెళ్తూ బొంగురు గొంతుకతో వేసినకూత మాత్రం విన్పిస్తోంది.

కిలకిలా నవ్వే చంద్రుణ్ణి చూసి ఆమెకూడా నవ్వింది. ఆ నవ్వు అర్థం తెలిసిన గోపాలం ఆమెను దగ్గరగాలాగుకొని ముద్దుపెట్టుకున్నాడు.

"ఈపని మధ్యాహ్నమే చెయ్యలేక పొయ్యారా?"

"నువ్వు ఇంత మంచిదానివని తెలుస్తే చేసేవాణ్ని-"

ఆ రాత్రి మిగిలిన భాగంలో అధికకాలాన్ని గోపాలం ఆమెతో నేగడిపి, తెల్లవారుజామున మాత్రం నిద్రపొయ్యాడు.

5

ఉదయాన ఆమె కాఫీతో హాజరైంది. గోపాలం తన కింతమర్యాద ఎందుకో ననుకున్నాడు. కాఫీ తాగుతున్న గోపాలంతో ఆమె అంది, "మీ రిప్పుడు హోటల్లో భోంచేస్తున్నారా?"

"ఔను"

"ఇవ్వాళ్నుంచి ఇక్కడికేరండి...."

"వొండిపెడతావా?"

"పోనీ వొండకుండానే పెడతానులెండి!" మృదువైన ఆమెహస్తాన్ని నొక్కుతూ, ఆమెనులోలోపల మెచ్చుకున్నాడు.

"ఎప్పుడు వస్తారు?" అంది ఆమె.

"పదకొండింటికి...."

"అందాకా భోంచెయ్యను"

"సుబ్బారావుకూడా వస్తాడా?"

ఆమె కొంచెంసిగ్గుపడి "ఆయనింక ఇక్కడకు రారను కొంటాను" అంది.

"ఎందుకనీ?"

"ఇద్దరమూ పోట్లాడుకున్నాం."

"మరిమాట్లాడుకుంటున్నారుగా—"

"మాట్లాటకూ పోట్లాటకు సంబంధం లేదు"

గోపాలం తలుపుతీసి ఐదురూపాయల నోటును ఆమె కిస్తూ "ఇంటిఖర్చుకు వాడుకో" అన్నాడు.

"ఇప్పుడు అవసరం లేదులెండి"

"ఉంచుకో—" అని నోటును ఆమె జాకెట్టులో నెట్టి కొంటెగా నవ్వుతూ రోడ్డెక్కాడు.

మూడురోజులు గడిచేప్పటికి అనుకోని మార్పులు చాలా జరిగాయ్. సుందరి బలవంతంమీద గోపాలం తన సామానంతా ఆమె ఇంట్లోకే జేర్చాడు.

ఇన్నాళ్లూ మెల్లిమెల్లిగా సాగేనీడలు ఇప్పుడు వడివడిగా జరుగు తున్నయ్. మెల్లిగా కదిలే తన చేతిగడియారపు

ముళ్ళను చూసుకుంటూ కూర్చోవటం పనికాదు తన కిప్పుడు. ఆమెతో సరససల్లాపాలాడుతూంటే సూర్యచంద్రుల గమనవేగం కూడా సరిగ్గా తెలిసేది కాదు. ఆమె భార్యాత్వం ఇల్లావుంటుందనీ, ఆదర్శసంసారసరళి ఇదనీ 'ప్రాక్టికల్'గా చూపుతున్నట్టు తోస్తోంది.

"మీ రెప్పుడూ నా దగ్గరే కూర్చుంటే మీ వ్యాపారం ఏ మౌతుందీ?" అని అడిగింది ఒకనాడు.

"మాదంత పెద్దవ్యాపారం కాదు లే" ఆమెకు అను మానం తీరినట్టు లేదు.

"నేను మీ పనులకు అభ్యంతరమన్నమాట...."

"లేదు లే!" ఆమె ఇంకేమీ మాట్లాడలేదు.

అన్నం వుడికిందో లేదో తెలుసుకునేందుకు ఒక్క మెతుకు పట్టుకు చూస్తే చాలు. అల్లాగే ఈవారంరోజుల్లో సుందరి తత్వం గోపాలానికి పూర్తిగా అర్థమైంది. ఆమె తన మాటకు ఎదురు చెప్పదు సరికదా, ఎప్పుడూ తన తృప్తి కోసమే ప్రయత్నిస్తుంది. వైవాహికజీవితపు విలువను తెలుసు కోలేక పారిపోయి వచ్చిన — సుందరిలాంటి అభాగ్య స్త్రీలందరి మీదా గోపాలనికి యీనాడు మొట్టమొదటిసారి సానుభూతి కలిగింది. బహుశా ఆమె యవ్వనరక్తపు పొంగుకు పడ్డ శిక్ష కాబోలు ఇది!

గోపాలం జీవితంలో నూతన రవిరశ్మి ప్రసరిస్తోంది. ఇల్లువదలి దూరానవున్నా – అతనికి ప్రాణానికి ఎంతో

హాయిగా వుంది. పొగాకు ధర ఇంకా ఎక్కువౌతుందనే ఆశ గోపాలంలో పనిచేసింది. ఇంతవరకూ ఆఛాయలేమీ కన్పించలేదు; కాని ఇంకా రెండువారాల పాటు చూద్దామనే ఆశ అతన్ని వీడలేదు.

6

ఆసాయంత్రం ఎల్లా ఇల్లు జేరాడో గోపాలానికే తెలియదు. తలనొప్పి దంచేస్తాంది. కీళ్ళన్నీ పట్టుకు పొయ్యాయ్. చలికూడా ఆవరించింది. కన్పించే వస్తువులన్నీ గిరగిరా తిరిగిపోతున్నయ్. మళ్ళీ చలిజ్వరం కమ్ముకుందనుకున్నాడు.

గోపాలాన్ని చూసి సుందరి అంది "ఇవ్వాళ మీముఖం వాడినట్టుగావుంది—"

మంచంమీద కూలబడుతూ వణుకుతూన్న కంఠంతో గోపాలం అన్నాడు: "ముందు వాబెడ్డింగులోవున్న శాలువ తీసికప్పు–" ఆమె కప్పి అతన్ని ఆనుకొని కూర్చుంది. అతని శరీరం చాలా వేడిగా ఉంది.

ఆమె కొంచెం భయంతోనే అంది: "ఒళ్ళు వేడిగా కూడావుంది"

చలికి ముడుచుకుంటూ అతను అన్నాడు: "జ్వరం వచ్చింది."

"డాక్టర్ కోసం కబురుచెయ్యమంటారా?"

"ఇక్కడ ఎవరున్నారు?"

"పక్క ఇంట్లో పనిచేసే నౌకరున్నాడు."

"ఫరవాలేదు— ఇది చలిజ్వరం - వీలైతే నేను రాసి ఇచ్చిన మాత్రలు తెప్పించు—" ఆమె తలవూపింది.

గోపాలానికి ఇది చాలా సామాన్యవిషయం; అతని జ్వరానికి మందు అతనికే తెలుసు. గోపాలం రాసిఇచ్చిన కాగితం తీసుకువెళ్లి నౌకరు మందుతెచ్చాడు. ఒక మాత్ర మింగి కాసిని మంచినీళ్ళు తాగి గోపాలం పడుకున్నాడు.

ఒక గంటగడిచాక, తననుకనిపెట్టుకు కూర్చున్న సుందరితో అతను, "నువ్వుభోంచెయ్యి—" అన్నాడు.

"నాకు ఆకలికావటంలేదు."

"అదేం?"

"నాకుభయమేస్తోంది—"

గోపాలానికి జాలికలిగింది. ఒకరిబాధను చూసి వేరొకరు అందులోనూ చెప్పుకోదగ్గ సంబంధంలేని సుందరిలాటి వ్యక్తిఎందుకు సానుభూతిచూపాలో, చూపాల్సినఅగత్యం యేమిటో అతనికి బోధపడలేదు. సుందరి తననుసౌఖ్యపెట్టేందుకు శతవిధాల ప్రయత్నిస్తూన్నట్టు మాత్రం అతనికి ఇదివరకే తెలుసు. అన్నాడు, "నాకేంఫరవాలేదు: నువ్వుభోంచేసి రా" ✓

ఆమెకదలకుండా తనవైపుజాలిగా, బాధగాచూసింది. గోపాలానికి ఆబాధలోనే ఒకవిధమైనఆనందం స్ఫురించింది.

ఆమె గడ్డంపట్టుకొని గోపాలం అన్నాడు : "నాకిది మామూలుగా వచ్చే జ్వరమే; నువ్వు భోంచేసిరా, సుందూ! బతిమాలుతూన్నాగా!"

ఆమెమాట్లాడకుండా లేచివెళ్ళింది. గోపాలందీర్ఘంగా ఆమెనుగూర్చి ఆలోచిస్తూ కళ్ళుమూసుకున్నాడు. మరిరెండు నిమిషాల్లో ఆమె తిరిగి వచ్చింది.

"భోంచేశావా?"

"ఆఁ"

"అబద్ధం!"

"కావలిస్తే చెయ్యివాసన చూడండి" ఆమె చెయ్యివాసన చూశాక గోపాలం అనుమానం తీరింది.

"ఇంత త్వరగా ఎల్లా భోంచేశావు!"

"నాకు అన్నం సయించలేదు."

గోపాలం నిట్టూర్చాడు. నలిగివున్న ఆమెజీవితాన్ని కూడా లెక్కచేయ్యకుండా తనమీద ఇంత జాలిచూపటం దేనికో?

గోపాలం పక్కలోకూర్చొని సున్నితంగా అతని ఫాలభాగాన్ని తాకుతూ ఆమె, "నిద్రవస్తోందా?" అని అడిగింది. ఆమె మృదుహస్తాల రాపిడిలో గోపాలానికి సగం తలనొప్పి తగ్గినట్టుగావుంది ఆమెసమక్షంలో ఆబాధకాదు—అంతకు రెండంతలైనా సులభంగా అనుభవించొచ్చని అతను తలిచాడు.

అతనేమీ మాట్లాడలేదు. అబ్బ! ఎంత హాయిగా వుంది. ఇంత అందాన్నీ ఇంత సౌకుమార్యతనూ సుందరి లాంటి పతితస్త్రీలలో సృష్టించిన భగవంతుడు నిజంగా దూష నార్హుడే. లోకం ఆమెలోని మంచిగుణాల్ని లెక్కచెయ్యదు. 'లేచివచ్చిన రంకులాడి' అంటుంది ఆమె వ్యక్తిత్వానికున్న విలువను గోపాలం తను ఇంకే ధనంతోనూ కొనలేడు! ఆమెనుగూర్చి ఇంకేమేమో ఆలోచిస్తూ గోపాలం మరొక సారి నిద్రాదేవి కౌగిట్లోకి పారవశ్యతను చవిచూసేందుకు పరుగెత్తాడు.

7

నాలుగు రోజుల్లో జ్వరం జారింది. ఈ నాలుగురోజులూ సుందరి తనకు యీలోకంలో మరెవ్వరూ లేనట్టూ, గోపాలం ఒక్కడే దిక్కన్నట్టూ అతని సేవతోనే గడిపింది... అతని అవయవాలన్నీ మళ్ళీస్వాధీనంలోకి వచ్చాయ్. ఎక్కడ లేని ఆకలీ పుట్టుకొచ్చింది.

"సుందూ! ఇవ్వాళ పత్యం!"

"జ్వరం పోయిందా?"

"చూడు" ఆమె శరీరాన్నితాకి చూసింది. మామూ లుగానే వుంది.

"ఏం?" అన్నాడు గోపాలం సుందరివైపుచూస్తూ.

"జ్వరం లేదుకాని ఇనా సాయంత్రందాకాచూద్దాం"

"ఈ ఆకలికి నేను ఆగలేను. నాకిప్పుడు పత్యం కావా ల్సిందే!" అని గోపాలం ఖచ్చితంగా చెప్పాడు

"మీకంత తొందరెందుకూ?"

"నాస్థితిలో నువ్వుంటే తెలిసేది" గోపాలంనవ్వాడు; ఆమెకూడా నవ్వింది "అన్నం వండు" అన్నాడు తనకున్న తొందర్నంతటినీ పొందుపరుస్తూ. "తిని నిద్రపోతారా?"

"ఉహుఁ."

గోపాలం ఆమెతో ఏమేమో మాట్లాడుతూనే ఆమె చేసేవంటవైపు ఆతృతతో చూడసాగాడు

"అయింది, రాండి" గోపాలానికి పోయినప్రాణి లేచొచ్చినట్టుగా వుంది. కాళ్ళు కడుక్కొనివచ్చి అన్నంముందు కూచున్నాడు. సరిగా సయించకపోయినా ఏతో నాలుగు మెతుకులు నంజి పక్కమీద వాలాడు.

ఆమెకూడా భోంచేసి గిన్నెలు దొడ్లోపడేసివొచ్చింది. అతను కళ్ళుమూసుకొని పడుకోవటంచూసి, "అదుగో నిద్ర పోతున్నారు జ్వరం తలకెక్కుతుంది" అంది.

"లేదు ఊరకనే కళ్ళుమూసుకున్నా."

"నిద్రమనకు చెప్పివస్తుందాయేం—లేచికూర్చోండి"

గోపాలం లేచికూర్చొని, కాస్తఆగి అన్నాడు, "కాస్త పనివుంది. బజారు వెళ్ళిరానా?"

"ఇప్పుడేగా పత్యంతీసుకొంది అప్పుడే బజారెందుకు? ఒద్దు."

పొగాకుమార్కెట్ ఎలావుందో తెలుసుకోవాలని గోపాలానికి కుతూహలంగావుంది. ఈపాటికి ఇతరవర్తకులందరూ తమసరకును పూర్తిగా అమ్మేసివుంటారు. ఈ సంవత్సరం తన ఒక్కడిసరుకే మిగిలింది. జ్వరం తన వ్యాపారాన్ని కొంతవరకూ నిరుత్సాహపరిచినా, నష్టంవస్తుందని మాత్రం భయపడక్కర్లేదు.

అతను మాట్లాడకుండా పక్కమీద వాలగానే ఆమె అందుకుంది: "మళ్ళీ నిద్రపోతారు—"

"ఊరకనే పడుకున్నా...."

"అసలు పడుకోవద్దు"

"మరేంచెయ్యమంటావ్ ?"

ఆమె సమాధానానికి కొంచెం ఆలోచించి, చూరులోంచి పాతపేక నొకదాన్ని తీసి దుమ్ము దులిపింది. ఆ డొక్కముక్కల్ని చూసిన గోపాలానికి నవ్వు ఆగలేదు. కాని అతని నవ్వు ఆమెను ఏమాత్రమూ నిరుత్సాహపరచలేదు.

"పేకాడుదాం—"

"నీకు పేకాటకూడా వచ్చా?"

"ఏదోకొంచెం" అని చప్పరించింది.

ఇద్దరూ పేకాటకు ఉపక్రమించారు. కాని గోపాలం మనసంతా మార్కెటులోనే పచార్లుచేయసాగింది. అతనికి దురాశ లేదు. వీలైనంత త్వరలో ఏ కొద్దిలాభానికైనా అమ్మెయ్యాలనుకున్నాడు.

సాయంత్రం నాలుగుగంటలదాకా పేకాట కాలక్షేపం జరిగింది. గోపాలానికి సంపూర్ణ ఆరోగ్యం చేకూరినట్టుంది.

"ఒక్కసారి బజారు వెళ్ళివస్తా—సుందూ!" లేచి నిలబడ్డాడు.

"మీకంత తొందరెందుకు? రేపు పొద్దున వెళ్లవచ్చు"

"జట్కాలో వెళ్లి అరగంటలో తిరిగివస్తా—"

"నేను పోనీను—" ఆమె తన రెండు చేతుల్నీ అడ్డంగాజాచింది. ఆమెనుచూసి గోపాలం జాలిగా నవ్వాడు.

మాట్లాడకుండా మంచంమీద కూలబడ్డ అతనితో "కోపంవచ్చిందా?" అంది.

"లేదు" అన్నాడు, ఆమె తల నిమురుతూ.

8

తలవని తలంపుగా పొగాకుధర అమితంగా పెరిగింది. ఒకవిధంగా చూస్తే గోపాలానికి యీ జ్వరం రావటం లాభదాయకమే అయింది. ఇంతకుపూర్వమే తను సరుకు అమ్ముకున్నట్టయితే అతనికి అందరితోపాటే స్వల్పలాభం వచ్చి ఉండేది!

సరుకు అమ్మి—ఇంటికొచ్చి కూనిరాగాలు ప్రారంభించాడు.

"ఇవ్వాళ చాలా కులాసాగా ఉన్నారు" అంది ఆమె. కాని అతను పరిచయంలేని సంగీతములోనే నిమగ్నుడయ్యాడు.

"నాతో మాట్లాడరూ?"

"ఏమిటీ?"

"ఇవ్వాళ ఇంత సంతోషానికి కారణం?"

"శింగురంగడు!" అన్నాడు రూపాయి మోగించినట్టు— వేళ్లను ఆడిస్తూ. నవ్వి ఊరుకుంది.

ఆ సాయంత్రమే గోపాలాన్ని వెతుక్కుంటూ — నురుగులు కక్కుతూవచ్చి పడ్డది టెలిగ్రాం — తన తండ్రి మరణశయ్యమీద వున్నాడు. తను వచ్చికూడా రెండు నెల్లయింది. పనికూడా పూర్తయింది. ఇంక ఇక్కడ ఉండటం అనవసరం; ఇంటిదగ్గర తను ఇప్పుడు అత్యవసరం. ఈసంగతి సుందరితో చెప్పాడు; ఆమె మాట్లాడకుండా జాలిగా చూసింది.

కొన్ని క్షణాలు నిశ్శబ్దతలోనే గడిచి పోయ్యాయ్. ఆమె అతని పాదాలదగ్గిర కూర్చొని మెల్లిగా అంది: "మళ్ళీ ఎప్పుడొస్తారు?"

"ఏమో! చెప్పలేను సుందూ! ఒకవిధంగా ఇది చివరి కలయికే ననుకోవాలి...." మాట్లాడేందుకు ఆమెలోని ఏశక్తీ సహాయం చెయ్యలేదు.

"విచారపడుతున్నావా—సుందూ?"

ఆమె మాట్లాడే శక్తిని కూర్చుకుంటూ, అంది; "లేదు."

ఆమె అబద్ధమాడినా.... ఆమె కళ్ళు నీరు కార్చటం ఆపలేదు. తల వొంచుకొని ఏడ్చింది.... గోపాలానికైనా యీ వియోగం చాలా బాధాకరంగానే వుంది.

ఆమె సుబ్బారావును నమ్మి తన జీవితాన్ని ధ్వంసం చేసుకున్నందుకు ఆత్మ ఘోషించింది. ఇంత కృత్రిమ వాతావరణంలోనూ ఆమె తనకుచేసిన సపర్య-జీవితంలో మరువరానిది. ఈ రెండునెల్లనుంచీ ఆమె తనను దమ్మిడీ కూడా, అడగకుండా కాపరాన్ని ఎల్లా నడుపుతోందో?

"సుందూ! ఏంకావాలో చెప్పు.... ఏదైనాసరే ఇచ్చి వెళ్తాను...."

సుందరి సంతోషంతో చూచింది.

"ఏదైనాసరే ఇస్తాను" అన్నాడు మళ్లీ.

"నాకు...." అని ఆగింది.

"చెప్పు సుందూ! ఫరవాలేదు...." చనువుగా ఆమె తలను నిమిరాడు.

భయపడుతూనే పొడిగొంతుకతో ఆమె అంది: "నాకు అయిదు వందల రూపాయలు కావాలి...."

గోపాలం ఆమెను చూసినవ్వాడు; ఆమెకు ఏమీ అర్థమవనేలేదు. ఆమె ఏంఅడిగినా గోపాలం ఇచ్చేందుకు సిద్ధమేనని ఆమెకేం తెలుసు? గోపాలానికి యీ సంవత్సరం

వచ్చిన లాభాల్లో ఆమె అడిగిన మొత్తం ఒక లెక్కలోది కాదు.

"ఇంతేనా తీసుకో...." అని, ఐదువందల రూపాయిల నోట్లనూ ఆమెకిచ్చాడు. అడిగినప్పుడున్నంత ఉత్సాహం ఆమెలో తీసుకునేటప్పుడు లేదు; జంకుతో తీసుకుంది.

మరికొన్ని క్షణాలు గడిచాక గోపాలం వెళ్లేందుకు లేచి నిలబడ్డాడు ఆమె వలవలా యేడ్వసాగింది.

"కన్నీరు కార్చుతావెందుకు సుందూ? వీలైతే మళ్ళీ వస్తాలే. నువ్వలా ఏడుస్తుంటే నేను వెళ్ళలేను"

ఆమె బలవంతాన దుఃఖాన్ని ఆపుకొని, లేని ఉత్సాహంతో "ఏడవను మీరు వెళ్లండి...." అంది.

గోపాలం బరువైన కాళ్ళను లాక్కుంటూ ముందుకు సాగాడు. తన దృక్పథంనుంచి మరుగుపడేదాకా గోపాలాన్ని చూసి, కన్నీటితోపాటే వెలువడే వేడినిట్టూర్పుల్ని భరిస్తూ మంచంమీద వాలింది అభాగ్య సుందరి !

9

మనస్సుకు శాంతిలేదు. మతి చెడ్డట్టుగావుంది. తండ్రి మరణంకన్న ఎక్కువగా సుందరి అతన్ని బాధించసాగింది. మనశ్శాంతి కోసం అనేక వినోద ప్రదర్శనాల్ని చూశాడు. ఎన్నో పుస్తకాలు చదివాడు; అనేక విధాల ప్రయత్నించాడు.... కాని అది అసాధ్యమైంది. సుందరి తన కళ్ళల్లో మెస్లుతూన్నంత సేపూ అతనికి పిచ్చెక్కినట్టుండేది. ఇంత

డబ్బు వున్నా తను జీవిత మాధుర్యాన్ని అనుభవించ లేకుండా చేయగలిగింది అబల-అనబడే ఒక స్త్రీ!

మనస్సును స్వాధీనం చేసుకోలేక— సుందరికోసం వెళ్లాడు; ఇల్లు తాళం వేసివుంది.

పక్క భాగంలో వాళ్ళని అడిగాడు. "ఇల్లు ఖాళీ చేశారు" అన్నారు. "ఈ ఊళ్ళోనే ఉన్నారా?" అన్నాడు. "ఏమో మాకు తెలియదు...." అని సమాధానం.

ఎక్కడికో వెళ్ళిపొయ్యారు! ఎక్కడని తిరుగుతాడు? ఆ పట్టణమంతా ఎల్లా గాలిస్తాడు?

సుబ్బారావు పనిచేస్తున్న కాఫీహోటల్‌కు వెళ్లి కనుక్కున్నాడు: "పదిహేనురోజుల క్రితమే అతను పని మానుకున్నాడు" అన్నారు.

ఎక్కడవుందని వెదుకుతాడు? అసంభవం! నిరాశా, నిస్పృహాలు పెచ్చుగా ఆవరించాయి. ఐనా పట్టణమంతా బండిలో తిరిగాడు కన్పిస్తుందేమోనని. ఎక్కడా కన్పించ లేదు. తన విశ్వప్రయత్నం బూడిదలో పోసిన పన్నీర యింది! అతని జీవితంలో ఇంత పరివర్తనను తీసుకురాగల శక్తి సుందరిలో వుందని ఎవరనుకున్నారు?— నిరాశతో ఇల్లు జేరాడు.

చాలారోజుల వరకూ సుందరి విషయంలో గోపాలం బుర్ర చెడగొట్టుకున్నాడు. ఇలాటి దుర్భరజీవితం ఇకముందు సాగించటం ఎట్లాగా అనేది పెద్ద సమస్యయి కూర్చుంది.

చదువుకొని అనుభవమూ, విజ్ఞానమూ సంపాయించిన తనలాంటి యువకుడు, కొన్నిరోజులపాటు తనతో స్నేహం చేసిన ఒకయువతి కోసం బాధపడటం చాలాశోచనీయాంశమనుకుంటాడు. ఈ విషయంలో తనుతను సరిపెట్టుకోనేందుకు ప్రయత్నిస్తాడు. కానిఆమె మళ్లీ జ్ఞాపకం వస్తుంది—దాంతో తిక్కతిరుగుతుంది-అసలు మానవ హృదయమే దుర్బలమైంది. అందుకు తనేం చేస్తాడు?

10

మానవ జీవితంలో 'మరుపు' అనేది మహోపకారం చేస్తుంది. ఏనాడో జరిగినదాన్ని పట్టుకు కూర్చోలేం. గోపాలం యీమార్పు చెందేందుకు మొదటివాడు మాత్రం కాదు....ఆరేళ్ళు తిరిగిన కాలచక్రం సుందరి ఛాయనైనా అతని హృదయసీమలో లేకుండా కడిగేయగలిగింది. ఇప్పుడు అతను సాంఘిక జీవితంలో—సంసార రంగాన పడ్డాడు.

బాపట్లలో కోర్టుపని పూర్తిచేసుకొని తిరిగివెళ్తూ వుండగా—కుర్రవాడొకడు పరుగెత్తుకుంటూవచ్చి గోపాలం చెయ్యిపట్టుకున్నాడు.

"ఏమిటీ?" అన్నాడు గోపాలం తీక్షణంగా.

"మా అమ్మ పిల్చుకురమ్మంటోంది —"

గోపాలానికి తెలిసినవాళ్లుకానీ, బంధువులు కానీ, బాపట్లలో లేరు. మరి యీకుర్రవాడి తల్లి ఎవరో అతనికి అర్థ

మవలేదు. ఒకవేళ కుర్రవాడు పొరపడ్డాడేమోనని అటూ ఇటూ చూశాడు. ఆ బజార్న ఇతర జనసంచారమే లేదు.

"రాండి...." అని హెచ్చరించి చెయ్యిపట్టుకొని లాగుతున్నాడు కుర్రవాడు.

"ఎక్కడ?"

కుర్రవాడు వేలుపెట్టి చూపుతూ, "ఆ ఇంట్లో" అన్నాడు.

"పద" అని కుర్రవాడితో నడక సాగించాడు.

ఇంట్లోకి ప్రవేశించగానే సుందరి ఎదురైంది. కొన్ని క్షణాలవరకూ అతను ఆమెను గుర్తించలేక పొయ్యాడు.

"మరిచిపోయ్యారా?" అంది ఆమె.

"లే—దు"

"అలా కూర్చోండి—"

గోపాలం కుర్చీలో కూలబడ్డాడు; ఆరుసంవత్సరాల నాటి సుందరేనాయీామె? రూపుమారింది, గొంతుమారింది. స్థితికూడా మారివుంటుంది. కాని హృదయం మారలేదు. పూర్వపు రెండునెల్ల జీవితమూ అతని కళ్ళముందు తిరిగింది. ఎంతో ఆనందాన్నిచ్చి - వియోగంలో తనను దాదాపు పిచ్చివాణ్ణిగా చెయ్యగలిగింది — యీపిచ్చి సుందరేనా? 'సుందరా! ఎంత మారిపొయ్యావ్!' అందామనుకొన్నాడు. కాని కళ్ళనీళ్ళువచ్చాయ్. ఆమెచూడకుండా వొత్తుకున్నాడు.

సుందరికి కూడా ఆ దినాలుజ్ఞాపకమొచ్చాయ్. గోపాలంలో గొప్పమార్పేమీరాలేదు. ఆమె అంతరాత్మఘోష

కన్నీటిరూపం దాల్చింది. పక్కకు తిరిగి చీరకొంగుతో వొత్తుకుంది.

"ఇప్పుడు సుఖంగావున్నావా సుందరీ?"

"నా జీవితంలో సుఖమేమిటి? ఆరోజులు వెనకనే గడిచి పొయ్యాయ్." వొంచివున్న ఆమె ముఖంలోని భావమైతే అతనికి స్పష్టంగా తెలియకపోయినా, ఆమె దుఃఖిస్తోందన్న సంగతి అతను గ్రహించగలిగాడు.

"ఇప్పుడు ఎవరిదగ్గరుంటూన్నావ్?" అన్నాడు. తనలాటివాడే ఎవరో ఆమెను జేరదీసివుంటాడని.

"వారిదగ్గరే!"

"ఎవరూ?"

కొంచెం సిగ్గుపడుతూ అంది: "సుబ్బారావు-గారు"

"వాడితో పొట్లాడావ్ కదూ?"

"లే—దు వారుమావారే!"

సుందరి సుబ్బారావు భార్యా! తనకాసంగతి తెలియదే! అతనికి గుండె ఆగినట్టయింది! ఐనా గంభీరంగానే ప్రశ్నించాడు: "నేను వెళ్ళాకనే పెళ్ళాడాడా?"

"లే—దు అంతకు రెండేళ్ళముందే!"

ఆరిదౌర్భాగ్యుడా! అగ్నిసాక్షిగా పెళ్లాడిన భార్యని ఇతరుల దగ్గరకు పంపటమా? సుబ్బారావులాటి అధమాధముడు మచ్చుకైనా దొరుకుతాడని గోపాలం తలపలేదు! అతనిలో ఆవేదనాజ్వాలలు ప్రజ్వరిల్లసాగాయి.

"రాత్రికి వస్తారు—ఉండండి"

ఇంకా ఆ నీచుడిముఖం చూడటమా! అసంభవం! పాప! కొరగానితృణం!....ఇంకొక్క అనుమానం అతనికి తీరాలి. "సుందూ! ఐదువందలుకూడా వాడుఅడగమన్నాడా?"

"ఔను"

ధనసంపాదనకేనా-తనభార్య శీలాన్ని అడ్డంపెట్టింది! తనకే సుందరిలాటి భార్యవుంటే పువ్వుల్లోపెట్టి పూజించే వాడు! ఇంత ప్రపంచమూ భార్యను అగ్గిపెట్టిలాగు స్వేచ్ఛగా వాడుకుంటూవాన్నా గుడ్లు మిటరికించి చూస్తూకూర్చుంది! ఈ సంఘంలో ఒక్కరైనా యీ ఘోరాన్ని ప్రశ్నించలేక పోయ్యారు! పెళ్లినాడు పెద్దలు ఆశీర్వదించి భార్యమీద ఇచ్చిన హక్కును వెలకట్టి అమ్మాడు! ఆమెనుగూర్చి అబద్ధ మాడి—తనను మోసగించాడు! సుందరి తన భార్యని చెప్పినట్టయితే—ఆమె ముఖంచూసయినా తను డబ్బి ఇచ్చేవాడు! తనకోర్కెను ప్రజ్వలింప జేసేందుకు సుందరిని ఎరగా ఉపయోగించాడు? సంపాదనకోసం. భర్తను కాదన లేక తన మాహాన్ని అమ్మేందుకు సిద్ధపడ్డది-పిచ్చి సుందరి! ఒక జీవి నలగటంవల్ల వచ్చే ఆనందాన్ని రెండోజీవి అను భవిస్తూన్న యీలోకంలో ఇంకెన్నెన్ని వింతలున్నయో ?

విస్తుపోయి చూస్తూన్న గోపాలాన్ని చూపి ఆమె అంది: "ఇది మీకు ఆశ్చర్యంగా ఉండొచ్చు నేను ఆయన కోసమే ఇంతపనీ చేశాననుకోకండి; నేనుకూడా మిమ్మల్ని

వాంఛించాను. కాని నేనుకూడా ఒక విధంగా మిమ్మల్ని మోసమేచేశాను—క్షమించండి—"

కన్నీరు కారుస్తూన్న సుందరినిచూసి గోపాలానికి జాలికలిగింది. ఆమె తన జీవితంలో ఒకసారి ప్రియబాంధవైంది!

"ఇందులో క్షమించేందుకు యేమీలేదు సుందరీ!" అంతా మరిచిపోదామని గోపాలం ఆత్మతో పోట్లాడుతున్నాడు. కాస్త ఆగి ఆమె అంది; "కుర్రవాడు ఎవరో తెలుసునా?"

ఇందాక కుర్రవాడి మాటల్ని ఆధారం చేసుకొని గోపాలం అన్నాడు: "నీకొడుకు —కాదూ?"

"ఔను కాని వాణ్ని- మీ-వల్లనే కన్నాను" అంది ఆమె చాలా సిగ్గుపడుతూ. ఎదుటవున్న నిలువుటద్దంలో కన్పించే తన పాపకూ కుర్రవాడికీ చాలాపోలికలున్నయ్.

కుర్రవాణ్ని దగ్గరకు లాక్కుని "నీపేరేమిటమ్మా?" అని అడిగాడు.

వాడు బెదురుతూ, "గోపాలం" అన్నాడు; ఆమె నవ్వుతూ అంది; "మీ జ్ఞాపకార్థం పెట్టినపేరు—"

"నాకొడుకు-నాకొడుకు" అని గొణుగుతూ గోపాలం కళ్ళ నీళ్ళు తుడుచుకొన్నాడు.

— జనవరి, 1940.